మిర్చికి వేరుకుళ్లు తెగులు

'ఎండుమిరప ఘాటు / మండుటెండ ధాటు తట్టుకొనెడు దిట్టలున్న పట్టణమ్ము గుంటూరే' అని ఓ కవి వర్ణన. నిజమే. కానీ ఆ ఘాటు ఇవాళ తగ్గిపోతోంది. చేలోనే అంతెత్తున ఎదిగి ధరల ఘాటుతో రైతును కుబేరుడిని చేయాల్సిన మిర్చి పంట ఇవాళ తెగుళ్లతో సతమతమవుతోంది. అధిక వర్షాలు, అంతర్లీనంగా జొరబడిన కీటకాలు వెరసి.. పంటను ఎదగనీయకుండా చేస్తూ రైతును కుదేలు చేస్తున్నాయి రొంపిచర్ల మండలంలో...

- అధిక వర్షాలతో మిర్చి పంటలో ఆగిన ఎదుగుదల
- ఇప్పుడిప్పుడే ఎదుగుదల మొదలవుతున్న మిర్చి పైరు
- కనీస జాగ్రత్తలు తీసుకుంటే తెగుళ్లని అధిగమించవచ్చు: ఉద్యాన శాఖ అధికారులు



సంతగుడిపాడులో సాగవుతున్న మిర్చి పైరు



ఉరక దెబ్బకు ఎదుగుదల ఆగిపోయిన మిర్చి మొక్క

రొంపిచర్ల: మండలంలో ఈ ఏడాది సాగు చేసిన మిర్చి పంట ఇటీవల కురిసిన వర్షాలకు ఉరకదెబ్బకు గురై ఇప్పుడిప్పుడే మిరప మొక్కల్లో ఎదుగుదల ప్రారంభమైంది. ఈ ఏడాది రైతులు ఆగస్టు చివరి నుంచి సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో మిర్చి పంట సాగు ప్రారంభించారు. మొత్తం రైతులు పాదులు వేసి మొక్కలు నాటి సాగు ప్రారంభించారు. మండల మొత్తం మీద 10 వేల ఎకరాలు మెట్ట భూములు ఉండగా అందులో మిర్చి పంటను సుమారు 1200 ఎకరాల్లో సాగు చేశారు.

అలవాలలో అత్యధికంగా...

అత్యధికంగా అలవాల గ్రామంలో 252 ఎకరాల్లో, గోగుల పాడులో 232 ఎకరాల్లో, తురిమెళ్లలో 180 ఎకరాల్లో, మాచవరంలో 100 ఎకరాల్లో నల్లగార్లపాడులో 62 ఎకరాలు, రొంపిచర్లలో 80 ఎకరాలు, వడ్లమూడి వారిపాలెంలో 50 ఎకరాలు, వి.రెడ్డిపాలెంలో 45 ఎకరాలు, అన్నవరప్పాడులో 40 ఎకరాలుతో పాటు కొన కంచివారిపాలెం, అచ్చయ్యపాలెం, ఆరేపల్లి, విప్పర్ల, ఎడ్వర్డ్‌పేట, అన్నవరం, మునుమాక, వీరవట్నం, ముత్తనపల్లి, సుబ్బయ్యపాలెం గ్రామాల్లో స్వల్ప విస్తీర్ణంలో మిర్చి పంట సాగుచేశారు. అయితే మిర్చి పంట నాటిని మొదటి నెలలో వాతావరణం పూర్తి అనుకూలంగా ఉండగా, వర్షాలు అధికమవ్వడంతో పంట ఎదుగుదలకు ఆటంకం ఏర్పడింది.

అబ్బా.. ఉరక దెబ్బ!

ముఖ్యంగా వర్షాలు ప్రారంభానికి ముందు బెట్టకు వచ్చిన మిర్చి పంటకు నీరు కట్టిన



గోగులపాడులో పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు

పొలాల్లోని మొక్కలు ఉరక దెబ్బకు ఎక్కువగా గురయ్యాయి. మిర్చి మొక్కలు రంగు ఎర్రగా మారి పూర్తి ఎదుగుదల ఆగిపోయింది. కొన్ని మొక్కలు ఎండిపోయాయి. దీంతో పాటు వేరు కుళ్ళుడు, వేరు పురుగు ఆశించి ఎక్కువ మొక్కలు ఎండిపోయాయి. ఎండిపోయిన మొక్కల స్థానంలో తిరిగి మిర్చ మొక్కలను నాటుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయ, ఉద్యాన అధికారులు అలవాల, గోగులపాడు, రొంపిచర్ల, నల్లగార్లపాడు, మాచవరం గ్రామాల్లోని మిర్చి పొలాలను తరచూ సందర్శించి రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏరుకుళ్లుడు, సిలీంద్రయ తెగులను గుర్తించి అవసరమైన సిఫా

మొక్కలు ఎండిపోయాయి



ఎకరంన్నరలో మిర్చి పంట సాగుచేస్తున్న, వర్షాలకు ముందే మిర్చి మొక్కలు బెట్టకు వచ్చి వడబడటంతో ఓ పర్యాయం నీరు కట్టా, నీరు కట్టిన మరుసటి రోజు నుంచే వర్షాలు ప్రారంభమయ్యాయి. పల్లంలో వర్షపు నీరు నిలబడటంతో అక్కడి మిరప మొక్కలు అన్ని ఉరక దెబ్బకు గురయ్యాయి. మిగిలిన మొక్కల్లో కూడా ఎదుగుదల నిలిచింది.

–కిక్కుర్రు శ్రీనివాసరెడ్డి, రైతు, మాచవరం

సస్యరక్షణ చేపట్టాలి



అధిక వర్షాలకు మిర్చి పంటలో అధిక నీరు నిల్వ ఉండటం వల్ల మొక్కలో ఎదుగుదల తగ్గింది. మొక్కలో వేరు వ్యవస్థ కుళ్లిపోతోంది. మిర్చి మొక్కలను రక్షించుకునేందుకు రైతులు రెడోమిల్ మందును లీటర్ నీటికి 2 ఎం.ఎల్ చొప్పున లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటితో కలిపి వేరు వ్యవస్థ తడిచే విధంగా మొక్కల మొదళ్లలో పోసి నివారించుకోవచ్చు. ప్రస్తుత తరుణంలో మిర్చి అంతా ఇప్పుడిప్పుడే ఎదుగుదల ప్రారంభించింది. వేరు కుళ్లుడు తెగులు పూర్తిగా తగ్గుముఖం పట్టింది.

– నవీన్, ఉద్యాన అధికారి

నీరు కడితే ఈ తెగులు సాలు మొత్తానికి వ్యాపించి మొక్కలు అన్ని ఎండిపోయే ప్రమాదం ఉందని ఉద్యానశాఖ అధికారులు రైతులకు తెలియజేశారు. ఈ తరుణంలో ఈ తెగుళ్లను అధిక మించి పైరు ఇప్పుడిప్పుడే ఎదుగుదలను ప్రారంభించింది.

క్లుప్తంగా

నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన



నాదెండ్ల: సాతులూరు గ్రామంలో శుక్రవారం బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు వివిధ రకాల పంటల సాగులో నూతన పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటలు విత్తే కాలం, దిగుబడులు వచ్చే సమయం, కోత వంటి వివరాలను వివరించారు. క్యాలెండర్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు తక్కువ దిగుబడి రావటానికి కారణాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చెట్టు రూపంలో చిత్రీకరించారు. గ్రామంలో గతంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను టైమ్‌లైన్‌ద్వారా వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు వేణుగోపాల్, రామారావు పాల్గొన్నారు.

సాతులూరులో ఏసుబాబు విగ్రహావిష్కరణ



నాదెండ్ల: సాతులూరు గ్రామానికి చెందిన పెద కాపు, గ్రామ దేవతల ఆలయ ధర్మకర్త గొట్టిపాటి ఏసుబాబు విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2000 సంవత్సరంలో ఏసుబాబు భార్య లక్ష్మీ సర్పంచ్‌గా ఎన్నికై ఐదేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి పనులు నిర్వహించి గ్రామాభివృద్ధిలో తనదైన ముద్ర వేశారన్నారు. రోడ్డు ప్రమాదంలో ఏసుబాబు మృతి చెందటం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముసుగు శోభారాణి, ఉపసర్పంచ్ శరభయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు సత్యనారాయణ, జీబీఆర్ హ్యాచరీస్ ఎండీ గద్దం బిక్షారావు, నాయకులు నర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

నరసరావుపేట ఎంపీపీ జయశ్రీ వెంకట్రామిరెడ్డి



వినుకొండ(నూజెండ్ల): గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి ప్రజారోగ్యం కాపాడాలని ఎంపీపీ జయశ్రీ వెంకట్రామిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ గ్రామాలల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతోపాటు, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుట్టారెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మీ రాజా, ఈవోపీఆర్డీ సుందర్‌రెడ్డి, లతోపాటు అన్నిశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతోనే రక్షణ సాధ్యం

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని 29 వార్డు సచివాలయాల్లో ఎఎస్‌కేలు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, ఏఎన్‌ఎంలకు పురపాలక సంఘం కార్యాలయంలో అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. బేటీ బచావో... బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరిబాబు, ఐసీపీఎస్ జిల్లా ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రశాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. న్యాయవాది వాణిశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జి విజయకుమారి, ఎన్.హనుమాయమ్మ పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి పనిచేద్దాం

ఈపూరు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి పాటుపడదామని ఎంపీపీ ఈదర రాధిక అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీడీవో కె. ప్రభాకరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య, పారిశుద్ధ్యం సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

రెవెన్యూ, భూసమస్యలపై తక్షణమే స్పందించాలి

- విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని వీడండి
- నరసరావుపేట ఆర్డీవో కె.మధులత



శావల్యాపురంలో మాట్లాడుతున్న ఆర్డీవో మధులత

బొల్లాపల్లి: విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని వీడి సమస్యపై తక్షణమే స్పందించాలని నరసరావుపేట ఆర్డీవో కె.మధులత అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల స్థాయి రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ గతంలో అయ్యన్నపాలెం, రావులాపురం రెవెన్యూ గ్రామాల పరిధిలో అనర్హులకు అసైన్డ్‌మెంట్ కమిటీలో భూ పంపిణీ చేశారని, దీన్ని గుర్తించి తొలగించాలన్నారు. భూమిలేని నిరుపేదలను గుర్తించి అర్హులైన లబ్ధిదారులకు అసైన్డ్‌మెంట్ కమిటీలో భూ పంపిణీ చేయాలన్నారు. రెవెన్యూ, భూసమస్యల పట్ల అలసత్వం లేకుండా తక్షణమే పరిష్కరించాలని సూచించారు. నియోజక వర్గంలో బొల్లాపల్లి మండలం పట్టభద్రుల ఓటర్ల నమోదులో ప్రథమ స్థానంలో ఉండటం చెప్పుకోదగ్గ విశేషమని, 1282 పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించినట్లు ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.వి.సుధాకర్, వీఆర్వోలు, సర్వేలు తదితరులు ఉన్నారు.

జవాబుదారీగా పనిచేయాలి

శావల్యాపురం: రెవెన్యూ అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని నరసరావుపేట ఆర్డీవో కె.మధులత అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆర్డీవో ఆకస్మికంగా సందర్శించారు. మండలంలోని పోట్లూరు, పిచికలపాలెం తదితర గ్రామాల్లో మ్యూటేషన్ అర్జీలు 49 పెండింగ్‌లో ఉన్నాయని వీఆర్వోల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. వీఆర్వోలు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రీ సర్వే భూములపై వచ్చిన అర్జీలను విచారణ చేసి సత్వరమే సంబంధిత రైతులకు న్యాయం చేయాలన్నారు. భవిష్యత్‌లో భూ సమస్యలు రాకుండా ఉండటానికి పాత రికార్డులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రెవెన్యూ కార్యాలయంలో పాత రికార్డులను భద్రపరిచే గది పరిశీలించారు. అనంతరం గ్రామాల వారిగా వీఆర్వోల పనితీరు పెండింగ్‌లో ఉన్న అర్జీల గురించి తహసీల్దారు కె.సుజాత అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు పేరిసోముల నాసరయ్య, సర్వేయర్ యం.రాజు, సీనియర్ సహాయకులు చంద్రబాబు ఉన్నారు.

ఏఎంరెడ్డి కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

నరసరావుపేట రూరల్: ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. 40మంది విద్యార్థులు శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి మాట్లాడుతూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా సమాజంలో ఎన్నో ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు. రక్తదానం వలన శరీరంలో రక్తకణాలు సమృద్ధిగా అభివృద్ధి చెందడానికి దోహదపడుతుందన్నారు. తద్వారా మనిషి ఆరోగ్యంగా నూతన ఉత్సాహంతో ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ సయ్యద్ రహమతుల్లా, కళాశాల ప్రిన్సిపల్ భార్గవ్ భూషణ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు శంకరభారతీపురం విద్యార్థులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

నరసరావుపేట రూరల్: జాతీయస్థాయి ఆట్యాపాట్యా, తైక్వాండో పోటీలకు శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి శుక్రవారం తెలిపారు. ఆట్యాపాట్యా పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థినులు బి.సౌజన్య, టి.లక్ష్మీప్రసూన చంద్రిక, డి.రంగ మహాలక్ష్మీ, ఎం.స్నేహరెడ్డి, బాలురలో సి.హెచ్ వెంకటగురు ప్రశాంత్‌రెడ్డి, పి.వరప్రసాద్ రెడ్డిలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. తమిళనాడు ఈరోడ్‌లో ఈనెల 8, 9, 10 తేదీలలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో వీరు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. అలాగే తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో ఎం.శివసాయిశ్రీకర్, టి.జాన్‌పాల్, జి.దేవరాజ్‌లు ప్రథమస్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. వీరిని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జి.ఝాన్సీరాణి, ఎస్‌కె.ఫాతిమా, పి.తిరుపతిరావు, సత్యనారాయణ, కరీముల్లా, శంకరరావు, వెంకటేశ్వరరెడ్డి, సత్యవాణి, లక్ష్మీ, పావని, లక్ష్మీబాయ్‌లు అభినందించారు.

ఈపూరులో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

విద్యుత్ అక్రమ చౌర్యం చేస్తున్న వారికి రూ.7.39 లక్షల అపరాధ రుసుం



వివరాలు తెలియజేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ఈపూరు: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం సభ్యులు జిల్లా పర్యవేక్షణ ఇంజనీర్ డాక్టర్ పి. విజయకుమార్ ఆధ్వర్యంలో ఈపూరు సెక్షన్, ఇనిమెళ్ల, అంగలూరు, చిట్టాపురం, కె.ఉప్పరపాలెం, శ్రీనగర్, వడ్డెంగుంట ఏరియాల్లో శుక్రవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్.వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్. రాంబట్లు మాట్లాడుతూ ఈ తనిఖీల్లో 43 మంది అధికారులు, 126 మంది సిబ్బంది 43 బృందాలుగా ఏర్పడి 2740 సర్వీసులను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మీటరు లేకుండా డైరెక్టుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 40 మందికి రూ.1.03లక్షలు, మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 10మందికి రూ.3.05 లక్షలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న 3మందికి రూ.14వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 82మందికి రూ.3.17లక్షలు మొత్తం రూ.7.39 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు వివరించారు. విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టంకు లోబడి ఉంటాయని తెలిపారు. వినియోగదారులు నిబంధనల ప్రకారం విద్యుత్‌ను వినియోగించుకోవాలన్నారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 9440812263, 9440812360 నంబర్లకు నేరుగా లేదా వాట్సప్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో డీఈఈలు ఎస్. మల్లికార్జునప్రసాద్, బి. వెంకటేశ్వరరెడ్డి, ఏఈలు కె. కోటేశ్వరరావు, ఎ. చంద్రశేఖర్, ఆపరేషన్ ఏఈ ఎస్.గాంధీబాబు, ఆపరేషన్ డీఈఈ, ఏఈఈలు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడికి టోకరా

పోలీసులమంటూ బెదిరించి నగదు స్వాహా

నాదెండ్ల: గుట్టుచప్పుడు కాకుండా బెల్టు షాపు నిర్వహిస్తున్న ఓ ప్రబుద్ధుడిని పోలీసులమంటూ కొందరు బురిడీ కొట్టించి మద్యం, డబ్బు కాజేశారు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో శుక్రవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. గణపవరం గ్రామంలోని మహాలక్ష్మమ్మ చెట్టు సెంటర్‌లోని ఓ వ్యక్తి తన హోటల్‌లో బెల్టుషాపు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఇరువురు వ్యక్తులు తాము పోలీసులమంటూ హోటల్ వద్దకు వచ్చి నాలుగు మద్యం సీసాలు పట్టుకున్నారు. హోటల్ యజమానిని బెదిరించి ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని వెళ్ళారు. గ్రామం పొలిమేరకు వెళ్లాక అతన్ని బెదిరించి జేబులో ఉన్న రూ.1500లు తీసుకున్నారు. మరో రూ.5 వేలు ఫోన్‌పే చేయించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

ఎండుగుంపాలెం గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని గురువారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన శ్యాంసన్ అనే వ్యక్తి 20 క్వార్టర్స్ మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

శ్రీభవిష్య కళాశాల బ్రోచర్ ఆవిష్కరణ

బ్రోచర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నరసరావుపేట ఈస్ట్: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకవస్తున్న టైనీటాట్స్ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో శ్రీభవిష్య జూనియర్ కళాశాలను ప్రారంభించటం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. ఎన్జీఓ కాలనీలోని టైనీటాట్స్ పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు శ్రీభవిష్య జూనియర్ కళాశాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏ రంగం పట్ల మక్కువ ఎక్కువ ఉంటుందో ఆ రంగంలో మరింత ముందుకు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేయాలని తెలిపారు. విద్యారంగంలో గుర్తింపు పొందిన టైనీటాట్స్ యాజమాన్యం ఆ దిశగా ముందడుగు వేస్తూ కళాశాల ఏర్పాటు చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. టైనీటాట్స్ స్కూల్ డైరెక్టర్ పాతూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రాథమిక విద్య నుంచి సాంకేతిక కళాశాలల వరకు తమ సంస్థలు ఉన్నాయని తెలిపారు. విద్యారంగంలో తమ అంకితభావం గుర్తించి తమను ఆదరిస్తున్నారని వివరించారు. విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాలలో పేరుపొందిన శ్రీభవిష్య సంస్థ ప్రోత్సాహంతో తాము కూడా భాగస్వాములై నరసరావుపేటలో శ్రీభవిష్య కళాశాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎంఏఎం కళాశాల చైర్మన్ ఎం.ఆర్.శేషగిరి రావు, టైనీటాట్స్ డైరెక్టర్లు కరణం కొండలరావు, పాతూరి కోటేశ్వరమ్మ, కృష్ణవేణి ప్రిన్సిపల్ యనమదల వెంకటరామయ్య, ఎస్‌వీఆర్ కళాశాల ప్రిన్సిపల్ వీరవల్లి శ్రీనివాసరావు, నలబోలు శ్రీకాంత్, కపలవాయి విజయకుమార్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

జీవనోపాధి పెంపుదలకు కృషి చేయాలి

శావల్యాపురం: స్వయం సహాయక సంఘాలు జీవనోపాదులు పెంపుదలకు గ్రామ సమాఖ్యా సంఘాలు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. శుక్రవారం మండల సమాఖ్యా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. మహిళా సభ్యులు నెలవారి సమావేశాలతో పాటు పుస్తక నిర్వహణ బ్యాంకు లావాదేవీలపై అవగాహన కల్గియుండాలన్నారు.

క్లాప్ మిత్రలకు అవగాహన సదస్సు

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చెత్త సంపద కేంద్రాల్లో పనిచేయుచున్న క్లాప్ మిత్ర, షెడ్డు మిత్రలకు ఐసీటీ వారి సారథ్యంలో చేయాల్సిన విధులు బాధ్యతలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న లైఫ్ ఇన్సూరెన్స్ పథకాల గురించి అవగాహన కల్పించి పథకంలో భాగస్వామ్యులు కావాలన్నారు. ఈకార్యక్రమంలో ఐటీసీ జిల్లా కోఆర్డినేటరు సీహెచ్.శ్రీనివాస్,కె.ఏసోబు, ఈవోపీఆర్‌డి పి.సుగుణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నరసరావుపేటటౌన్: విద్యుత్ సబ్ స్టేషన్‌లు మరమ్మతులు కారణంగా శనివారం పట్టణం, మండల పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీఎల్ఎస్ ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: విద్యుత్ సబ్ స్టేషన్ మరమత్తుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల: విద్యుత్ సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మత్తుల దృష్ట్యా శనివారం విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గృహ, వ్యవసాయ, వాణిజ్య పరిశ్రమలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటలవరకూ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నరసరావుపేట రూరల్: పట్టణంలోని పారిశుద్ధ్య పనులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులపై అధికారులతో సమీక్షించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద కల్వర్ట్ పనులు, బస్టాండ్ ఆవరణలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ పరిసరాల్లో పరిశుభ్రతను కాపాడాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్టీసీ, మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బయో ఉత్పత్తుల విక్రయ దుకాణాల్లో తనిఖీలు

బొల్లాపల్లి: మండలంలో వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయ అధికారులు ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై శుక్రవారం విస్తృత తనిఖీలు చేశారు. రేమిడిచర్ల, గంగుపల్లి గ్రామాల్లో ఎరువులు, పురుగు మందు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. గంగుపల్లి గ్రామంలో ఎరువులు, పురుగు మందుల దుకాణంలో అనధికారంగా విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో 29,294 వివిధ కంపెనీల పురుగు మందులు, రూ. 2.97 లక్షల విలువైన ఎరువులు స్వాధీనం చేసుకున్నారు. రూ.2.45 లక్షల బయో ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రేమిడిచర్ల గ్రామంలో రూ. 2.92 లక్షల విలువైన బయో ఉత్పత్తులను సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జయదేవ్‌రాజన్, వ్యవసాయ శాఖ కార్యాలయం అధికారి సురేష్, అబ్బూరు అంకారావు, వీఆర్వో నన్నేషా, తదితరులు పాల్గొన్నారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నైపుణ్య గణన సర్వేను పారదర్శకంగా త్వరితగతిన పూర్తి చేయాలని నూజెండ్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి పావులూరి ఉమాదేవి అన్నారు. నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు శుక్రవారం నిర్వహించారు. యువతకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఈ సర్వే చేపడుతుందన్నారు. ఈ సర్వే నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు ఉపయోగపడుతుందని తెలిపారు.





